ప్రజాశక్తి
శుక్రవారం 2 జనవరి, 2026 8 పేజీలు
శ్రీకాకుళం

బోటు బయటకు తీస్తున్న మత్స్యకారులు

బోటు మునక
రూ.30 లక్షల నష్టం (వార్త...2)

గట...గటా

- కొత్త సంవత్సరం వేడుకల్లో భారీగా మద్యం విక్రయాలు
- డిసెంబర్ 30న అత్యధికంగా రూ.7.05 కోట్ల అమ్మకాలు
- మూడు రోజుల్లో రూ.18.59 కోట్ల ఆదాయం
- గతేడాది కాలంలో రూ.98.52 కోట్ల రాబడి

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం పరవళ్లు తొక్కింది. కొత్త సంవత్సరం పేరుతో గతేడాది డిసెంబరు చివరి రెండు రోజులూ మందుబాబులు పండగ చేసుకున్నారు. మద్యం ప్రియులకు మందు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం డిసెంబర్ 31తో పాటు కొత్త సంవత్సరం రోజైన బుధవారం రాత్రి ఒంటి గంట వరకు దుకాణాలకు అనుమతించింది. మందుబాబులు మాత్రం మందు విషయంలో ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో ప్రతి ఏడాది మాదిరినే గతేడాది డిసెంబర్ 30న రికార్డు స్థాయిలో అమ్మకాలు సాగాయి. ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లావ్యాప్తంగా 176 మద్యం షాపులు, 9 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఎప్పటిమాదిరిగానే కొత్త సంవత్సరం వేడుకల పేరుతో మందుబాబులు తెగ తాగారు. సాధారణంగా ప్రతి సంవత్సరం ఏడాది చివరి రోజైన డిసెంబర్ 31న భారీగా మద్యం అమ్మకాలు జరుగుతూ ఉంటాయి. 2025లో మాత్రం డిసెంబర్ 30నే అత్యధికంగా మద్యం కేసులు అమ్ముడుపోయాయి. 2024లో రూ.5.93 కోట్ల ఆదాయం రాగా, 2025లో రూ.7.05 కోట్ల రాబడి వచ్చింది. అదనంగా రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. డిసెంబర్ 30న ఐఎంఎల్ కేసులు అమ్మకాలు ఏకంగా పది వేల మార్కును దాటేసింది. 10,737 కేసులతో పాటు 2,824 బీరు కేసులు అమ్ముడుపోయాయి. ప్రభుత్వానికి రూ.7.05 కోట్ల ఆదాయం సమకూరింది. డిసెంబర్ 31న రూ.5.48 కోట్ల మేర అమ్మకాలు సాగాయి. ఇందులో 8,267 ఐఎంఎల్ కేసులు, 2052 బీర్ల కేసులు అమ్ముడు పోయాయి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన 8,990 ఐఎంఎల్ కేసులు, 2,884 బీరు కేసులు అమ్ముడుపోయాయి. వీటి ద్వారా రూ.6.06 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం మీద గతేడాది డిసెంబర్ 30, 31.. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ మూడు రోజులు కలిపి ప్రభుత్వానికి రూ.18.59 కోట్ల మేర రాబడి సమకూరింది.

శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో అత్యధిక ఆదాయం

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఈ నెల 30న రికార్డు స్థాయిలో అమ్మకాలు సాగగా, (మిగతా...2)

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గత ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటోతో ముద్రించి ఇచ్చిన భూహక్కు పత్రాలను రద్దు చేసి, వాటి స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా రెండు నుంచి తొమ్మిదో తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలను నిర్వహించి, నిర్దేశిత రైతులకు పట్టాలను అందజేయనుంది.

గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే చేసిన గ్రామాల్లో భూ యజమానులకు ఇచ్చిన హక్కు పత్రాలను వెనక్కి తీసుకుని, కొత్త పాసు పుస్తకాలను అందజేస్తారు. ఇందుకు మండలాలు, గ్రామాల వారీగా ఏ తేదీన, ఏ సమయంలో పంపిణీ చేస్తారన్న ప్రత్యేక షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. ఈమేరకు తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఈ ప్రక్రియ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 652 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. ఆ గ్రామాల పరిధిలో 2,54,218 కొత్త పాసు పుస్తకాలను నేటి నుంచి పంపిణీ చేయనున్నారు.

వెబ్‌ల్యాండ్ డేటాతో క్షుణ్ణంగా ధ్రువీకరించిన తర్వాతే అర్హులైన పట్టాదారులకు ఈ పత్రాలను పంపిణీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పంపిణీ సమయంలో ఏవైనా అభ్యంతరాలు తలెత్తితే వాటి నమోదు చేసి, తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస గ్రామంలో నిర్వహించే సభలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొని పాసు పుస్తకాలను అందజేయనున్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే స్వాగతం

మొక్కలు నాటిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మొక్కను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం పండగ వాతావరణం నెలకొంది. ఆంగ్ల నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను పలు శాఖల ఉన్నతాధికారులు తమ సిబ్బందితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా ఆర్భాటాలకు పోకుండా పర్యావరణ పరిరక్షణకు కలెక్టర్ ప్రాధాన్యమిచ్చారు. కలెక్టరేట్ ఆవరణలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన కలెక్టరేట్ సముదాయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న (మిగతా...2)

తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

జన సంద్రం

ప్రజాశక్తి- కవిటి

నూతన సంవత్సర వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఏకమవడంతో ఆనందోత్సవాలు వెల్లువిరిశాయి. ఆడారు, పాడారు, సరదాగా సంద్రంలో తడిశారు. ఆంగ్ల సంవత్సరానికి ఆహ్వానం పలు కుతూ, ఆనందోత్సాహాల వేడుకలకు వేదికైన కవిటి మండలం కొత్తపాలెం, పుక్కళ్లపాలెం, కపాసుకుద్ది తీరం జన 'సంద్రం'గా మారింది.

కొత్త సంవత్సర కోలాహలం

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, కవిటి, శ్రీకాకుళం సిటీ, టెక్కలి రూరల్

కోటబొమ్మాళి : కేంద్ర, రాష్ట్ర మంత్రులకు శుభాకాంక్షలు చెప్తున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి తదితరులు

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఆనందోత్సాహాల నడుమ కోలాహలంగా సాగాయి. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ గతేడాది తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఇతర ప్రజాప్రతినిధులను కలిసేందుకు వారి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ బారులు తీరారు. కలెక్టర్, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్‌ను కలిసేందుకు అధికారులు, పలు శాఖల సిబ్బంది రాకపోకల తో వారి బంగ్లాల వద్ద సందడి నెలకొంది.

బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా యువత కేరింతలు కొడుతూ బాణాసంచా కాల్చి, ఆటపాటలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కొన్ని కాలనీలు, అపార్ట్‌మెంట్లలో డిజిటల్ సౌండ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. గురువారంఉదయం నుంచి అధికారులు, సిబ్బంది, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల హడావుడి మొదలైంది. అన్ని స్థాయిల వారూ తమపై అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యాలయాల వద్ద కోలాహలం

కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు స్వగ్రామమైన కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. వారికి శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన ప్రజాప్రతినిధుల సమక్షంలో కేకును కట్ చేశారు. మంత్రులకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికారులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారి నుంచి పూలబొకేలు, శాలువాలకు బదులుగా పుస్తకాలు, పెన్నులు, మొక్కలు స్వీకరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తదితరులు మంత్రులను (మిగతా...2)

విశాఖ రేంజ్ ఐజిగా గోపినాథ్ జట్టి

బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖపట్నం రేంజ్ డిఐజిగా విధులు నిర్వహించిన గోపినాథ్ జట్టి ఉద్యోగోన్నతిపై ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి)గా విశాఖ రేంజ్ బాధ్యతలను గురువారం స్వీకరించారు. రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం, పోలీసు అధికారులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ రేంజ్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. పోలీసు యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజల విశ్వాసాన్ని మరింత చూరగొనే విధంగా పనిచేస్తుందని చెప్పారు. ఐజిగా బాధ్యతలు స్వీకరించిన గోపినాథ్ జట్టిని శ్రీకాకుళం జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేసి, నూతన సంవత్సరంతో పాటు ఉద్యోగోన్నతి శుభాకాంక్షలు తెలియజేశారు.

పూల మొక్క అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

బోటు మునక

రూ.30 లక్షల నష్టం

కవిటి : కవిటి మండలం కొత్తపాలెం తీరంలో లంగరు వేసిన బోటు సముద్రంలో మునిగిపోవడంతో మత్స్యకారుడు సూర్నె లచ్చయ్యకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. వేట కోసం బోటును సముద్రంలో నిలిపిన సమయంలో అందులోకి నీరు చేరి, బోటుతో పాటు వలలు పూర్తిగా మునిగిపోయాయి. తెల్లవారుజామున బోటు కనిపించకపోవడంతో తోటి మత్స్యకారుల సహాయంతో బయటకు తీశారు. అప్పటికే బోటు, వలలు పూర్తిగా పాడయ్యాయని, సుమారు రూ.30 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వ సహాయం అందించాలని ఆయన వేడుకున్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

రణస్థలం రూరల్: కళాకారులను ప్రోత్సహించాలని ఎంపిపి ప్రతినిధి కుమార్ అన్నారు. మండలంలోని కోష్ట గ్రామంలో శ్రీమణికంఠ నాటిక కళాపరిషత్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణరావు ఆధ్వర్యంలో నాటిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 33 మంది కళాకారులు పాల్గొని ఏకపాత్రాభినయాలు చేశారు. గెలపొందిన ప్రథమ రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.1500 నగదు బహుమతులతో పాటు మెమెంటోలు అందజేస్తున్నామని నిర్వాహకుడు లక్ష్మణరావు తెలిపారు.

సన్మానిస్తున్న ఎంపిపి ప్రతినిధి

కంచిలి కళాశాలలో సమస్యలు తిష్ట

అభివృద్ధికి నోచుకోని కంచిలి ప్రభుత్వ కళాశాల

ప్రజాశక్తి- కంచిలి

ప్రభుత్వ విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నామంటూ పాలకులు చెబుతున్న మాటలకు ఆచరణలో వారు చూపిస్తున్న చిత్తశుద్ధికి పొంతన ఉండదన్న మాటలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది కంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుర్కొంటున్న దుస్థితి. ఉన్న గదులు విద్యాబోధనకు చాలకపోగా, సరైన సౌకర్యాలు కల్పనకు నోచుకోక అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయింది.

కంచిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం 230 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, తెలుగు, ఇంగ్లీష్, ఒరియా మాధ్యమాల్లో నాలుగు గ్రూపులు నిర్వహిస్తున్నారు.

వేధిస్తున్న వసతి సమస్య

విద్యార్థుల బోధనకు సరిపడ తరగతి గదులు లేకపోగా, ఉన్న గదుల్లో వారికి బోధనతోపాటు సైన్స్ విద్యార్థులకు ప్రయోగాలు నిర్వహించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఉన్న భవనంలో కేవలం ఎనిమిది గదులు మాత్రమే ఉండటంతో ఒక గదిని ఆఫీస్ కార్యకలాపాలకు, ప్రిన్సిపాల్ రూమ్‌గా వాడుక చేస్తుండగా, ఇంకొక గదిని సైన్స్ ల్యాబ్‌గా ఉపయోగిస్తున్నారు. మిగిలిన ఆరు గదుల్లోనే అందరు విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం అదనపు గదుల నిర్మాణానికి పునాదులు వేసినా, సంవత్సరాలుగా అది పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసేందుకు విద్యార్థులు సమీపంలోని చెట్ల నీడలకు, పక్కవీధిలో ఇళ్ల వద్దకు చేరి ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిరుపేద విద్యార్థులు ఎక్కువశాతం చదివే కంచిలి ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

పరిసర ప్రాంత విద్యార్థులందరికీ...

కంచిలి మండల కేంద్రంతోపాటు మండల శివార్లలోని జలంత్రకోట, జె.మాణిక్యపురం, ముండల, ఎక్కల, అర్జునాపురం, ఘాటి, రేఖాదేవీపురం, జిల్లుండ గ్రామాలతోపాటు కవిటి మండలంలోని భైరాగిపుట్టుగ, మెళియాపుట్టుగ, కొన్నాయిపుట్టుగ, జమేదారుపుట్టుగ, బెలగాం, సహాలాపుట్టుగ తదితర గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులంతా కంచిలి ప్రభుత్వ కళాశాలలోనే విద్యాభ్యాసం చేస్తుంటారు. ప్రైవేటు కళాశాలల్లో చదివించేందుకు ఆర్థికస్తోమత లేక, అనేక ఇబ్బందులు పడుతూ వచ్చే విద్యార్థులకు కళాశాలలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

కవిటి : విప్ అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, అధికారులు

కొత్త సంవత్సర కోలాహలం

కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య, ఉపాధి రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, బల్లిపుట్టుగలో జెడిపి చైర్‌పర్సన్ పిరియా విజయ, కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావు కార్యాలయాలకు పెద్దసంఖ్యలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు బారులు బారులు తీరారు. వీరితోపాటు ఇతర అధికారులు, అనధికారులు, నాయకులు, కార్యకర్తలు వీరికి శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చారు. వందలాది మంది తరలిరావడంతో గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. వచ్చిన వారందరికీ కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారాయి.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కలు సుకునేందుకు జిల్లా

టెక్కలి రూరల్ : వాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైసిపి నాయకులు

మొదటి పేజీ తరువాయి

అధికారులు, అనధికారులు తరలివచ్చారు. అతిథులతో కలెక్టర్ బంగ్లా కళకళలాడింది. ఏటా మాదిరిగానే కలెక్టర్‌ను ఎన్‌జిఒలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డిని పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అనధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యం : మంత్రులు

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ యువతకు అవకాశాలు కల్పించడం, పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తామని వెల్లడించారు. ప్రజల సహకారంతో జిల్లా అభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లా నుంచి వచ్చిన ప్రతిఒక్కరికీ శుభాకాంక్షలు తెపారు.

టెక్కలి మండలం అక్కువరం వద్ద ఉన్న తన కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు అధిక సంఖ్యలో అభిమానులు నూతన శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణికి తన స్వగృహంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటిలాగే మున్ముందు మీరు చూపించిన ఈ అప్యాయత, ఈ అనురాగం, ప్రేమాభిమానం ఎల్లప్పుడూ ఉండాలని వాణి అన్నారు.

గట...గటా

అందులో శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో అత్యధికంగా విక్రయాలు సాగాయి. ఇక్కడ 2,385 ఐఎంఎల్ కేసులు, 783 బీరు కేసులు అమ్ముడుపోయి రూ.1.58 కోట్ల ఆదాయం సమకూరింది. ఆ తర్వాత స్థానంలో సోంపేట సర్కిల్ ఉంది. ఇక్కడ 1,415 ఐఎంఎల్ కేసులు, 336 బీరు కేసులు అమ్మకాలు జరిగి రూ.94.46 లక్షల ఆదాయం వచ్చింది. కొత్తూరు సర్కిల్ పరిధిలో అత్యల్పంగా ఆదాయం వచ్చింది. ఇక్కడ 304 ఐఎంఎల్ కేసులు అమ్ముడుపోయి కేవలం రూ.17.07 లక్షల ఆదాయం మాత్రమే సమకూరింది.

గతేడాది ఆ మూడు రోజుల్లో ఇలా ..

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా గతేడాది జనవరి ఒకటో తేదీన 3,018 ఐఎంఎల్ కేసులు,560 బీరు కేసులు విక్రయాలు జరిగాయి. వీటి ద్వారా రూ.2.10 కోట్ల ఆదాయం వచ్చింది. డిసెంబర్ 31న 6,084 ఐఎంఎల్ కేసులు,2,619 బీరు కేసులు అమ్ముడుపోయాయి. వీటి ద్వారా రూ.4.28 కోట్ల ఆదాయం సమకూరింది. డిసెంబర్ 30న 3,516 ఐఎంఎల్ కేసులు, 2,574 బీరు కేసులు అమ్మకాలు జరిగి రూ.5.93 కోట్ల ఆదాయం వచ్చింది.

కవిటి : జెడ్‌పి చైర్‌పర్సన్ విజయకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు

గతేడాది కాలంలో అమ్మకాల వివరాలు

గతేడాది జనవరి ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు సాగిన అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.98.52 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఏడాది కాలంలో 1,41,909 ఐఎంఎల్ కేసులు, 41,401 బీరు కేసులు అమ్ముడైపోయాయి. శ్రీకాకుళం సర్కిల్‌లో అత్యధిక మద్యం కేసులు అమ్ముడైపోవడంతో పాటు భారీగా ఆదాయం సమకూరింది. ఇక్కడ 31,617 ఐఎంఎల్ కేసులు, 12,396 బీరు కేసులు అమ్మకాలు జరిగి రూ.23.67 కోట్ల ఆదాయం వచ్చింది. రణస్థలం సర్కిల్‌లో రూ.9.50 కోట్ల ఆదాయం వచ్చింది. పలాస సర్కిల్‌లోనూ రూ.9.45 కోట్ల ఆదాయం సమకూరింది. ఇచ్ఛాపురం సర్కిల్‌లో అత్యల్పంగా రూ.3.17 కోట్ల ఆదాయం సమకూరింది.

పర్యావరణ పరిరక్షణతోనే స్వాగతం

రహదారికి ఇరువైపులా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. రహదారి సుందరీకరణలో భాగంగా నీడనిచ్చే మొక్కలను నాటి, వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడమే మనం భవిష్యత్ తరాలకు ఇచ్చే గొప్ప కానుకని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కొత్త ఏడాదిలో జిల్లాను హరితమయంగా మార్చేందుకు అధికారులు, ప్రజలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అభిమానులు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM
E.P No 35 /2024 in O.S No 42/2020

Between:-
VysyaRaju LaxmanaRaju, S/o. Late Sanjeev Raju, aged about 44 years, cultivation, R/o. Door No. 1-38, main road, Haddubangi village, Seethampeta mandal, Srikakulam district, Aadhar No.988285937337
.....Decree Holder

And:-
Korada Sireesh, S/o. Late Ramakrishna Rao, Hindu aged about 49 years, Running real estate business, permanent resident of Sivanagar colony of Narasannapeta town and mandal, Srikakulam district, presently residing at S.S.Estates and Constructions, Beside Neelammatalli Temple, Pedda Baratam street, Srikakulam town and district
.......Judgment Debtor

Respondent:
Korada Sireesh, S/o. Late Ramakrishna Rao, Hindu aged about 49 years, Running real estate business, permanent resident of Sivanagar colony of Narasannapeta town and mandal, Srikakulam district, presently residing at S.S.Estates and Constructions, Beside Neelammatalli Temple, Pedda Baratam street, Srikakulam town and district

NOTICE

Please take this notice that the above matter is posted to 31-12-2025 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **02-01-2026 at 10.30 A.M.**, either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

By Court Order

D. T. MANI CHANDAN
ADVOCATE FOR PETITIONER,
SRIKAKULAM.

సామాజిక న్యాయం ఎక్కడ?

- రిజర్వేషన్లకు పాలకులు తూట్లు
- ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం
- 'శ్రామిక ఉత్సవ్' వేదికపై పలువురు వక్తలు

శ్రామిక ఉత్సవ్‌లో మాట్లాడుతున్న సినీ దర్శకుడు సత్యారెడ్డి, వేదికపై ధనలక్ష్మి, వైఎల్, సుబ్బన్న తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

దేశంలో సామాజిక న్యాయం కరువవుతోందని, రిజర్వేషన్లకు పాలకులు తూట్లు పొడుస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో గురువారం 'సామాజిక న్యాయం - సాధనకు ఉద్యమిద్దాం' అనే థీమ్‌తో కార్యక్రమం తలపెట్టారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ దర్శకులు సత్యారెడ్డి మాట్లాడుతూ చలనచిత్రం సమాజంలో మార్పు తీసుకువచ్చే అతిపెద్ద మీడియా వ్యవస్థ అని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాను నిర్మించిన 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 150 థియేటర్లలో విడుదలై విజయవంతమైందని తెలిపారు. విశాఖలో 100 రోజులు ప్రదర్శితమైందని అన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యమ స్ఫూర్తితో సుద్దాల అశోక్ తేజ రాసిన పాటను తన చిత్రంలో వాడుకునేందుకు అనుమతించిన సిఐటియు నాయకులు సిహెచ్.నర్సింగరావు, అయోధ్యరామ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన ఎదుగుదలకు ప్రజా యుద్ధనౌక గద్దర్ ఎంతో సహకరించారని, భవిష్యత్తులో ఉద్యమల స్ఫూర్తితో మరిన్ని చిత్రాలు తీసి ప్రజలను చైతన్యం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు సుబ్బన్న మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లను ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని విమర్శించారు. ఉపాధి హామీపై కేంద్రం దాడి పట్ల ఆయన నిప్పులు చెరిగారు. ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు డాక్టర్ వైఎల్.నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణ విధానాల వల్ల సామాన్యులకు ఆ సేవలు భవిష్యత్తులో అందని ద్రాక్షగా మారుతాయని, దీనిపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి, సామాజిక న్యాయాన్ని మాత్రం 125 అడుగుల లోతున పూడ్చిపెట్టారని తెలిపారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుగా ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మనుధర్మ శాస్త్రం గురించి మాట్లాడే శక్తులు దళితులను, మహిళలను అణచివేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 4వ తేదీన విశాఖలో జరిగే సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేసి పాలకులకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ, దుశ్యంత్, ప్రముఖ న్యాయవాది వెంకటేష్, బి.నగేష్ పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవం.. శ్రామిక చైతన్య వేదిక

సినీ దర్శకుడు సత్యారెడ్డి ప్రశంసలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

అక్షరం ఆయుధంగా, జ్ఞానం మార్గదర్శిగా సాగే పోరాటాలే సమాజంలో మార్పును తీసుకువస్తాయి. ఈ సిద్ధాంతాన్ని పుణికిపుచ్చుకుని సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న 'శ్రామిక ఉత్సవ్' ప్రస్తుతం విజ్ఞాన భాండాగారంగా విరాజిల్లుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన పుస్తక మహోత్సవం మేధావులను, పుస్తక ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తోంది. గురువారం సాయంత్రం ఈ పుస్తక ప్రదర్శనను ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత, నిర్మాత సత్యారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి స్టాల్‌ను కలియతిరుగుతూ, అక్కడ కొలువుదీరిన వేలాది పుస్తకాలను పరిశీలించారు. ప్రజాశక్తి బుక్ హౌస్, సిఐటియు సహకారంతో ఇంత భారీ స్థాయిలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. సందర్శనలో భాగంగా సత్యారెడ్డి కేవలం పుస్తకాలను చూడటమే కాకుండా కొన్ని అరుదైన గ్రంథాల చరిత్రను, వాటి సేకరణ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో ఇన్ని వైవిధ్యమైన పుస్తకాలను ఒకే వేదికపై చూడటం అరుదైన విషయమని, సామాజిక చైతన్యాన్ని రగిలించే ఇటువంటి ప్రదర్శనలు నేటితరానికి ఎంతో అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న సత్యారెడ్డిని చూడగానే పుస్తక ప్రేమికులు, విద్యార్థులు ఉత్సాహం ప్రదర్శించారు. ఆయన కూడా ఎంతో వినమ్రంగా సందర్శకులతో ముచ్చటించి, వారితో ఫొటోలు దిగారు. పుస్తక పఠనం పట్ల యువత ఆసక్తి చూపడం శుభపరిణామమని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. శ్రామిక ఉత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ పుస్తక మహోత్సవం కేవలం పుస్తకాల అమ్మకపు కేంద్రంగానే కాకుండా, ఆలోచనల వేదికగా మారుతోంది. సత్యారెడ్డి వంటి ప్రముఖుల సందర్శన ఈ ఉత్సవానికి మరింత శోభను చేకూర్చింది.

పుస్తక ప్రదర్శనను సందర్శిస్తున్న సినీ దర్శకుడు సత్యారెడ్డి

సంస్కృతి విశాలమైనది

- పరిరక్షణకు రాజీలేని పోరాటాలు అవసరం
- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, వేదికపై ఎస్.వెంకటరావు

ప్రజాశక్తి - గాజువాక

సంస్కృతి విశాలమైనదని, దాన్ని కాపాడుకోవడానికి రాజీలేని పోరాటాలు అవసరమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆరు రోజులుగా జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా సాహిత్య వేదికపై గురువారం 'బహుళ సంస్కృతులు - భారతీయతత్వం' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంస్కృతి ఎలా అభివృద్ధి చెందిందీ వివరించారు. ఉమ్మడి సంస్కృతిలోనే జీవించే హక్కు, భాష, చిత్రలేఖనం, కలిసి జీవించి ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకోవడం వంటివి వచ్చాయన్నారు. సైన్స్, టెక్నాలజీ ఈ సంస్కృతిలో నుంచే వచ్చాయన్నారు. ఉన్నతమైన మానవ విలువలు వైపు పెరగాలనేదే సంస్కృతి అని చెప్పుకొచ్చారు. అయితే ఆధిపత్య సంస్కృతి పేరుతో ప్రజల మధ్య గొడవలు పెట్టి అదాని లాంటి వ్యక్తులు దోపిడీ చేసుకోవడానికి పాలకులు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఆ దోపిడీపై ప్రజలు తిరగబడతారనే భయంతోనే ముందుగానే కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రజలపై ఆధిపత్య సంస్కృతిని రుద్దుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో వీరబ్రహ్మం, వేమన, మొల్ల రాసిన గ్రంథాల్లోని అభ్యుదయవాదాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఆదిపత్య వైఖరిపై పోరాటం చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తోందని అన్నారు. విశ్వ మానవ సంస్కృతిని కాపాడేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వెంకటరావు మాట్లాడుతూ ఒక సంస్కృతిని చూసి మరొక సంస్కృతి పాటిస్తున్నవారు అసూయపడుతున్నాయన్నారు. సంస్కృతి అభివృద్ధి చెందాలే తప్ప అసూయ పెరగరాదన్నారు. దేశంలో వేషధారణలోనూ, ఆహారంలోనూ, నడవడికలోనూ ఒకరిని ఒకరు అసహ్యించుకోవడం పెరిగిందన్నారు. చైనాలో ఈ విధమైన విధానాలు లేవని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, బహుళ సంస్కృతి కలయికే భారతీయతత్వం అన్నారు. అన్ని సంస్కృతులనూ కాపాడుకోవాలన్నారు. యు.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌పై పి.శ్రీనివాసరావు పాడిన పాట ఆకట్టుకుంది. సభానంతరం అతిథులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
శుక్రవారం 2 జనవరి 2026


మహాసభలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

సిఐటియు మహాసభ దృశ్యమాలిక

విశాఖ సాగర తీరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభ గురువారానికి రెండోరోజుకు చేరుకుంది. కార్యదర్శి నివేదికపై ప్రతినిధులు చర్చలు జరిపారు. దేశంలోని కీలక పోరాటాల్లో పాల్గొన్న వారంతా ఇక్కడకు రావడంతో ఉత్తేజపూరిత వాతావరణం నెలకొంది.



ప్రజాశక్తి బుక్‌స్టాల్ వద్ద కేరళ కార్మిక శాఖ మంత్రి శివన్‌కుట్టి

పాలస్తీనాకు మద్దతు

వేదికపై హేమలత, వరలక్ష్మి, సింధు మాటామంతి

విజూకృష్ణన్‌కు జ్ఞాపిక అందజేత

మహాసభ ప్రాంగణంలో తపన్‌సేన్, సిహెచ్.నర్సింగరావు

మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ఉత్సవ్ వేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

ఆట.. పాట.. అదరహో

‘శ్రామిక ఉత్సవ్’లో ఆకట్టుకుంటున్న కళారూపాలు

ఉద్యమ ఘట్టాలను తన హావభావాలతో రక్తికట్టిస్తున్న కళాకారుడు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట ప్రజానాట్య మండలి కళాకారులు ఆరో రోజు గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆట, పాట, పలు అభ్యుదయ గేయాలు, నృత్య రూపకాలు సభికులకు ఆద్యంతం ఆలోచింపజేశాయి. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్, జివిఎంసి, తదితర రంగాల, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన, నిర్వహిస్తున్న ఐక్యపోరాటాలను, సాధించిన హక్కులను గుర్తుచేస్తూ ‘పోరాటాల సంఘమో.. సిఐటియు సంఘమో’ అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాట ఆలోచింపజేసింది. జివిఎంసి కార్మికులు ప్రదర్శించిన తీన్‌మాన్ సభికులను ఆకట్టుకుంది. ‘అమ్ముతుంటే చూస్తామా.. ప్రభుత్వ రంగాన్ని’, ‘ప్రయివేటు భూతం లేచింది బిడ్డా’, ‘పాడి ఆవును అమ్మేసి.. పాలు కొనుక్కుందామా’.. అంటూ ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ఎలా కార్పొరేట్లకు పాలకులు కట్టబెడుతున్నదీ కళాకారులు వివరించారు.

‘తలకు మించి పరుగెత్తి.. తెల్ల ఏనుగు అంటారు’ అంటూ ప్రభుత్వ రంగం ప్రాధాన్యతను వివరిస్తూ ‘సబ్సిడీలు ఇచ్చింది.. సాయంగా వచ్చింది’, ‘గుడ్డిలోన మెల్ల లాగ.. ఆపదలో అన్న లాగ’ అంటూ కళాకారులు పాడిన పాట ఆహూతులను హత్తుకుంది.

మన రక్తం ధారబోసి పెంచిన సంపదను కార్పొరేట్లకు కట్టబెడితే ఊరుకోబోమని హెచ్చరిస్తూ ‘పోనీ అనుకోవద్దు.. పొలికేకై నిలదీద్దాం’ అంటూ కళాకారులు పాడిన పాటకు సభికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది.

‘సంపద సృష్టికి మూలం.. చెమట చుక్కరే అన్నా’ అంటూ ‘పొలాల్లో పంటలు పండించడంలోనూ, పరిశ్రమల్లో యంత్రాలు, యంత్ర పరికరాల తయారీలోనూ వ్యవసాయ కూలీలు, కార్మికులు పడే కష్టాన్ని వివరించే ప్రయత్నం చేశారు కళాకారులు. ‘ఏళ్లయినా ఏలికలు మారినా.. మారలేదు మన బతుకులు’ అన్న పాట ద్వారా శ్రమజీవుల పట్ల పాలకుల వైఖరిని కళ్లకు కట్టినట్లు కళాకారులు వివరించారు. హక్కుల కోసం ఎర్రజెండా అండగా ఉందని చెబుతూ ‘ఎర్రెర్రని జెండా చేత బట్టి శ్రామిక రాజ్యం తేవాలి’ అంటూ పాడిన పాట చైతన్యం నింపింది.

సరోజ బృందం ఆధ్వర్యాన వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు ప్రదర్శించిన ‘జాగోరె జాగో’ ప్రదర్శన ఆకట్టుకుంది. భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత పోరాటాల ద్వారానే భవిష్యత్తు ఉందని చెబుతూ ‘యువతతోనే భవిత సాధ్యం.. నేటి మాట సత్యం’ అన్న పాట అందరినీ ఆలోచింపజేసింది. ‘ఆశయాల భవిత మనది.. దారి చూపు వెలుగు మనది’ అంటూ పాడిన పాట యువత పోరాటాల మార్గాన్ని ఎంచుకోవాలన్న సందేశాన్ని ఇచ్చింది.

‘సమ్మె నీ జన్మ హక్కు రా.. దాన్ని ఆపే దమ్మెవడికి ఉందిరా’ అంటూ ఉప్పు సత్యాగ్రహం దర్శకులు, నటులు సత్యారెడ్డి పాడిన పాటకు సభికుల నుంచి స్పందన లభించింది. ఉత్తరాంధ్ర ప్రజా గాయకులు వంగపండు ప్రసాదరావు పాడిన ‘ఎం పిల్లడో ఎల్దమొస్తవో.. చికాకుళం కడ చీమకొండ కడ’ అంటూ ఆయన కుమారుడు దుష్యంత్ పాడిన పాటకు సభికులు చప్పట్లతో సభాస్థలి మార్మోగింది.

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్రపై కాకినాడ ప్రజానాట్య మండలి కళాకారుల బృందం నృత్యరూపకాన్ని ప్రదర్శించింది. జాతీయోద్యమంలో సుందరయ్య పాత్ర, ఆయన చేసిన త్యాగాన్ని వివరించారు. ఏ రూపంలోనైనా దోపిడీని సుందరయ్య ధీటుగా ఎదురొడ్డిన వైనాన్ని వివరించారు కళాకారులు. సైకిల్‌పై నెల్లూరు వెళ్లి టోకుగా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి దళితవాడల్లో అందజేసిన సుందరయ్య మానవత్వాన్ని చాటిచెప్పారు. ‘విశాలాంధ్రలో ప్రజారాజ్యం సజీవంగా చూపిన వాడు సుందరయ్య’ అంటూ కమ్యూనిస్టు యోధుని ఔన్నత్యాన్ని వివరించారు.

శ్రమజీవి విశిష్టతను తెలియజెబుతూ కళాకారిణి ప్రదర్శన

విప్లవ గేయాలను ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

శ్రమ విశిష్టతను తెలియజెబుతూ కళాకారుల నృత్యరూపకాలు

ప్రదర్శనలతో చైతన్యం రేకెత్తిస్తున్న కళాకారులు

ప్రభుత్వ రంగంపై కార్పొరేట్ల దోపిడీని వివరిస్తూ సాగిన కళా ప్రదర్శన

అంతిమ విజయం కార్మికులదేనంటూ సాగిన సన్నివేశం

ప్రశంసాపత్రాలతో కళాకారులు

యువత డ్యాన్స్

కార్మికుల పోరుతో దిగొచ్చిన యుబి

లాభాలే తప్ప కార్మికులు ఖాళీ కడుపుతో ఉన్నా తమకేమీ సంబంధం లేనట్టుగా కొన్ని కంపెనీలు వ్యవహరిస్తున్నాయి. ఉత్పత్తి తగ్గిందనే పేరుతో పనిదినాలకు కోత పెట్టి వారిని పస్తులు ఉండేలా చేస్తున్నాయి. ఉత్పత్తి పెరిగినా, లాభాలు వచ్చినా పని దినాలు పెంచడానికి ససేమిరా అంటున్నాయి. కార్మికులు కడుపు మండి ఆందోళనలు చేస్తే, అప్పుడు దిగొచ్చి పని ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ కంపెనీ ఇదే కోవలోకి వస్తుంది. యాజమాన్యం తీరుపై యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు పలురూపాల్లో పోరాటం సాగించిన తర్వాత పని దినాలను పెంచింది. కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని విరమించుకుంది.

ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

- ఉత్పత్తి తగ్గిందని పనిదినాల కోత
- పలురూపాల్లో ఆందోళనలు చేసిన శ్రామికులు
- కార్మికుల తొలగింపును అడ్డుకున్న సిఐటియు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ కంపెనీలో సుమారు 600 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానంతో తమకు ఆర్డర్లు తగ్గాయని, ఎక్కువ రోజులు పని ఇవ్వలేమని కంపెనీ యాజమాన్యం చేతులెత్తేసింది. నెలలో ఏడు నుంచి పది రోజులు మాత్రమే పని ఇచ్చి మిగిలిన రోజులు కార్మికులను ఇళ్లకే పరిమితమయ్యేలా చేసింది. దీనిపై కార్మికులు భగ్గుమన్నారు. యాజమాన్యం తీరును నిరసిస్తూ యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు జాతీయ రహదారి దిగ్బంధనం, చలో కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, రణస్థలంలో ర్యాలీ, భిక్షాటన తదితర రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. పనిలో నుంచి 300 మంది కార్మికులను తొలగించాలని ప్రయత్నిస్తున్న సందర్భంలో ఆందోళనలు ఉధృతం కావడంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. కార్మికులకు కొన్ని రోజులపాటు పని ఇవ్వడానికి కూడా నిరాకరించడంతో, కార్మికులు ఆందోళనతో వారం రోజుల పాటు పని కల్పించింది.

పనిదినాలు పెంచిన యాజమాన్యం

2024 ఎన్నికల ముందు వరకు వారం, పది రోజుల పాటు పని కల్పించిన యాజమాన్యం, ప్రస్తుతం 13 రోజుల వరకు పని కల్పిస్తోంది. కంపెనీ ఉత్పత్తి, వ్యాపార విస్తరణ పెరిగినా ఆ మేరకు కార్మికులకు పని కల్పించడానికి మాత్రం అంగీకరించడం లేదు. కంపెనీ వ్యవహారాల్లో బిజెపికి చెందిన ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తన మనుషులకు చెందిన కొందరికి కంపెనీలో పని ఇవ్వాలని హుకుం జారీ చేయడంతో, అదనంగా కొంతమందికి పని కల్పించినట్టు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు 13 రోజులకు మించి పని దొరకని పరిస్థితి నెలకొంది.

లఘుచిత్రాలు.. సామాజిక చైతన్యానికి ప్రతిబింబాలు

లఘుచిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న ఆహూతులు

కళ కేవలం వినోదానికే కాదు..., అది సమాజాన్ని మేల్కొలిపే ఆయుధమని విశాఖ వేదికగా నిరూపితమైంది. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ముందస్తు వేడుకల్లో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'శ్రామిక ఉత్సవ్' అట్టహాసంగా సాగింది. వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ సమన్వయంతో జరిగిన లఘు చిత్రాల ప్రదర్శన.. సమకాలీన సమస్యలను, శ్రామిక జీవుల వ్యధలను, రాజకీయ వైఫల్యాలను అత్యంత శక్తివంతంగా వెండితెరపై ఆవిష్కరించింది. ప్రదర్శనలో భాగంగా సుమారు 4 రోజుల పాటు 30 లఘు చిత్రాలను ప్రదర్శించారు. పద్మశ్రీ సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ నటి రోహిణి, మాదాల రవి, విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ వంటి ప్రముఖులు ఈ ప్రదర్శనలకు హాజరై.. దర్శకులను అభినందించడం విశేషం.

తెరపై ప్రదర్శిస్తున్న లఘుచిత్రం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం లఘుచిత్రాల ప్రదర్శనలో ప్రధానంగా నిలిచింది. సుదీప్ సాయి రూపొందించిన 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్', కౌశిక్ దర్శకత్వంలో వచ్చిన 'సేవ్ స్టీల్‌ప్లాంట్', చంద్రశేఖర్ తెరకెక్కించిన 'మహా వృక్షం' లఘు చిత్రాలు స్టీల్‌ప్లాంట్‌ను కేవలం ఒక ఫ్యాక్టరీగా కాకుండా, వేలాది కుటుంబాల జీవనాధారంగా, ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా చూపాయి. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'మై ఓట్ నాట్ ఫర్ సేల్' చిత్రం ఓటును నోటుకు అమ్ముకోవడం వల్ల ప్రజలు తమ ఐదేళ్ల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారో కళ్లకు కట్టినట్లు చూపింది. ఆర్.భార్గవ రాయ్ రూపొందించిన 'ఫ్రీడమ్ ఆర్టికల్ 21' వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కుల ప్రాముఖ్యతను ప్రశ్నించింది. నగరాన్ని శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల జీవితాలపై కె.మహేష్ బాబు తీసిన 'అన్సంగ్ హీరోస్', పుష్యమి దర్శకత్వం వహించిన 'శ్రామిక జీవన సౌందర్యం' చిత్రాలు వారి నిస్వార్థ సేవను, వారు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతను హృద్యంగా ఆవిష్కరించాయి. కొత్తపల్లి సీతారాం నిర్మించిన 'వీరి బతుకు' ఉత్తరాంధ్ర జనజీవన కష్టాలను ప్రతిబింబించింది. నేటి యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై పలు చిత్రాలు చర్చించాయి. ఫ్యుబె క్రియేషన్స్ వారి 'ఎఫ్ 2' నిరుద్యోగ యువత ఆవేదనను చూపగా, దామోదర్ దర్శకత్వంలో వచ్చిన 'యుద్ధం ప్రకటించు', 'ఇది ఆరంభం' చిత్రాలు డ్రగ్స్ మహమ్మారిపై యువత పోరాడాలని పిలుపునిచ్చాయి. పి.రమేష్ కుమార్ తీసిన 'జయహే' మత సామరస్యాన్ని ప్రబోధించగా, సనరా వంశి రూపొందించిన 'మాతృదేవోభవ' వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించింది. ఉమామహేష్ దర్శకత్వంలోని 'ఇంక్' చిత్రం కలం బలాన్ని, మేధావి వర్గం సమాజం పట్ల చూపాల్సిన బాధ్యతను చాటిచెప్పింది. భీశెట్టి జయబాబు రూపొందించిన 'బాల్యవివాహాలు నిర్మూలిద్దాం' చిత్రం ఆడపిల్లల హక్కుల కోసం గళమెత్తింది.

లఘుచిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్‌భరత్

ప్రముఖుల ప్రశంసలు - ప్రోత్సాహం

లఘుచిత్రాల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ వాస్తవికతకు దగ్గరగా సినిమాలు తీయడం అభినందనీయమన్నారు. నటి రోహిణి, మాదాల రవి.. చిత్రాల నాణ్యతను, దర్శకుల సామాజిక స్పృహను కొనియాడారు. కేవలం విశాఖకే కాకుండా విజయవాడ, నిడదవోలు, శ్రీకాకుళం వంటి ప్రాంతాల కళాకారులకు ఇది ఒక గొప్ప వేదికగా నిలిచిందని నిర్వాహకులు ఎల్లాజీ, కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ లఘు చిత్రాల ప్రదర్శన కేవలం ఒక కళా ప్రదర్శనగా మాత్రమే కాకుండా, సామాజిక మార్పు కోసం ఒక గళంగా నిలిచింది. కార్మికుల హక్కులు, సామాజిక బాధ్యత, దేశ భవిష్యత్తుపై చర్చను రేకెత్తించడంలో ఈ 'శ్రామిక ఉత్సవం' విజయవంతమైంది. భవిష్యత్తులో కార్మిక సమస్యలపై మరిన్ని చిత్రాలు రాబోతున్నాయని ప్రకటించడం ఈ ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనం.

రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి-భగవాన్‌పురం మార్గంలో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని పంచాయతీరాజ్ ఎఇ ఎస్.లక్ష్మణరావు గురువారం తెలిపారు. ఈ నేపథ్యంలో టెక్కలి రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి ఎన్‌టిఆర్ నగర్ వరకు పది రోజుల పాటు రాకపోకలు నిలివేస్తున్నామని అన్నారు. రోడ్ విస్తరణ, ఇరువైపులా కాలువల నిర్మాణం చేపడుతున్న తరుణంలో పనులకు ఆటంకం లేకుండా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు ఈనెల 3న శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎఇ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్లు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించడంతో పాటు ఎపి ట్రాన్స్‌కో టవర్స్ నిర్మాణం, ఇతర మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్ ఫీడర్‌కు సంబంధించి పొందూరు, జోగన్నపేటతో పాటు కొంచాడ ఇండస్ట్రియల్ పరిధిలో గల గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ దంపతులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- అరసవల్లి

మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గురువారం ఖ్యాతి ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు, చీరలు, లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అనురాగ నిలయంలో అనాథ చిన్నారులకు రొట్టెలు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, శివప్రసాద్ దంపతులు, బరాటం వాసుదేవరావు దంపతులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి

కలెక్టర్‌ను కలిసిన తహశీల్దార్

ప్రజాశక్తి- పలాస

కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌ను కూడలి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ తహశీల్దార్ వాయిలపల్లి గిరి రాజు, విఆర్‌ఒ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ల శ్రావణ్‌కుమార్, ఆర్‌ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

లైసెన్స్ ఇంజినీర్ల సర్వేయర్ల అండ్ ఆర్కిటెక్స్ అసోసియేషన్ తరుపున ఇచ్ఛాపురం పురపాలక సంఘం కమిషనర్ నల్లి రమేష్‌తో నూతన సంవత్సర 2026 డైరీని గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో లైసెన్స్ ఇంజినీర్ సర్వేయర్ జోనల్ కో-ఆర్డినేటర్ వేదుల సంతోష్‌కుమార్, మున్సిపల్ ఎఇ కిషోర్‌కుమార్, ఇన్‌ఛార్జి టిపిబిఒ చంటి, పట్టణ ప్రణాళిక సెక్రటరీ లలిత్ కుమార్ పాల్గొన్నారు.

25న జిల్లాస్థాయి హిందీ ప్రతిభా పరీక్ష

జిల్లాస్థాయికి ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తున్న విశ్రాంత డిఇఒ తదితరులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు జిల్లాస్థాయి హిందీ ప్రతిభా పరీక్షను జనవరి 25న జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు హిందీ మంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు, ఉత్తరాంధ్ర కార్యదర్శి కోనే శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. హిందీ సేవా సదన్ (అనంతపురం) ఆధ్వర్యంలో గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పాఠశాల స్థాయి హిందీ టాలెంట్ టెస్ట్‌లో జిల్లాస్థాయి పరీక్షకు ఎంపికైన పాఠశాల స్థాయి టాపర్స్ వివరాలను విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు జిల్లా కేంద్రంలో విడుదల చేశారని తెలిపారు. హిందీ మంచ్ సంస్థ సమన్వయంతో ఉత్తరాంధ్రలో 2,300 మందికిపైగా విద్యార్థులు పాఠశాల స్థాయి ప్రతిభా పోటీలో పాల్గొన్నారని, వీరిలో 150 మంది పాఠశాల స్థాయిలో ప్రతిభావంతులుగా నిలిచి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 25న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సంచాం యుపి స్కూల్, రణస్థలం హైస్కూల్, అక్కులపేట హైస్కూల్‌కు చెందిన హిందీ పండిట్‌లు రొంపివలస రామారావు, బి.మంజుల, కనుగుల సత్యం జిల్లాస్థాయి పోటీకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. పాఠశాల స్థాయి ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అంద జేయనున్నట్టు, జిల్లాస్థాయి పోటీలో టాపర్స్‌గా నిలిచే విజేతలకు ప్రత్యేక సమావేశంలో మెడల్స్ బహూకరించి సత్కరించనున్నట్టు వివరించారు. జిల్లాస్థాయి పోటీ పరీక్షకు ఎంపికైన విద్యార్థులను విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు, విశ్రాంత సెట్‌శ్రీ సిఇఒ సురంగి మోహనరావు అభినందించారు.

కేలండర్లు ఆవిష్కరణ

కవిటి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎపిటిఎఫ్, ఆపస్, అపోటా చేస్తున్న సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. నూతన సంవత్సరం సందరరేగా ఎపిటిఎఫ్, ఆపస్, అపోటా 2026 సంవత్సరం క్యాలెండర్లు గురువారం ఆవిష్కరి ంచారు. ఈ నూతన సంవత్సరంలో విద్యారంగం మరింత అభివృద్ధి చెందాలన్నారు. అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎంఇఒలు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ ఆవిష్కరించి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయాశాఖల సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఎపిటిఎఫ్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం ఎంఇఒలు ఎస్.దేవేంద్ర రావు, పద్మనాభరావులు గురువారం ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఢిల్లీశ్వరావు, అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు అప్పలరాజు, రామారావు, అనిల్ కుమార్, వెంకట రావు, చిన్నారావు, శ్రీనివాస్, ధర్మారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో ఆపోటా ప్యాకెట్ క్యాలెండర్‌ను ఉత్తరాంధ్ర జిల్లాల ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, ఉత్తరాంధ్ర ఒడియా డి.ఐ.దుర్గాప్రసాద్ చౌదరి, ఆపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌పాడి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి, ఆపోటా మాజీ అధ్యక్షుడు రఘునాథ గౌడ్‌లు నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి- పలాస

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి పనులు చేస్తూ ఈ ఏడాదంతా ముందుకు సాగాలని పొత్రియ సీయోను గ్రీస్ చర్చ్ ఫాస్టర్ సవర జగన్నాయకులు అన్నారు. మండలంలోని పొత్రియలో గురువారం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి మార్గాన్ని ఎంచుకొని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం గిరిజన బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జగన్నాయకులు, కృపావతి

సన్మానిస్తున్న సభ్యులు

దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు సుబ్రరా, కేశవరావు, గున్నయ్య, మాధవరావు, తేజేశ్వరరావు, ప్రవీణ్, వాసుదేవరావు, సవర కిరణ్, సవర సంజీవ్, సవర శేఖర్ పాల్గొన్నారు.

రామారావు సేవలు మరువలేనివి

నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జెన్ని రామారావు సేవలు మరువలేనివని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, ఎన్.భైరాగి కొనియా డారు. మండలంలోని నగరంపల్లిలో రామారావు ఏడో వర్ధంతి సభ ఎన్.మోహనరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుక్త వయసులో ప్రజా తంత్ర యువజన సంఘంలో చేరి యూత్ సమస్యలపైన యువకులను సంఘటితపర్చి ఆందోళన నడిపారని గుర్తు చేశారు. యువతను ఆట, పాటల్లో, కాకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేసేలా చేశారని అన్నారు. సిపిఎంలో చేరి పార్టీ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ, బి.సుగుణావతి, ఎన్.ఈశ్వరమ్మ, బి.లక్ష్మి, డి.భీమారావు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా...

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జెసిఐ ఆధ్వర్యాన 30 రోజుల పాటు ఫిట్ ప్రోగ్రామ్ ఉత్సాహభరితంగా ప్రారంభించారు. కొత్త సంవత్సరానికి ఆరోగ్యమే లక్ష్యంగా, సవాళ్లను స్వీకరించే స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహించారు. లోకల్ ఆర్గనైజేషన్ సభ్యులు జయదేవ్, వెచ్చ రాము, రాజ్‌కమల్, శణ్ముఖ, స్వరూప్, నరేష్, అనిత్ చౌదరి, అధ్యక్షులు జె.శ్రాణ్ చురుగ్గా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంపొందించడం, ఫిట్ ఇండియా లక్ష్యాన్ని ముందుకు

వ్యాయామం చేస్తున్న స్థానికులు

తీసుకెళ్లడమే ఈ 30 రోజుల కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

గోరింటలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోరింటలో అవినాష్ సావే ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదంతో చైర్మెన్ కూన వెంకటరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన మహిళలకు బహుమతులతో పాటు, పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులను సంక్రాంతి రోజున అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా గ్రామానికి చెందిన చింతాడ మంగమ్మ, బాడాన మౌనిక, కూన శ్రీలేఖలు వ్యవహరించారు. ఈ పోటీలకు సహకరించిన కూన కార్తీక్, పప్పల శ్రీనివాస్, గ్రామ యువకులకు ఆయనతో పాటు ఫౌండేషన్ కార్యదర్శి దుంపల మృదుల కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్న గీత

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ఆమదాలవలస: పురపాలక సంఘం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులకు కొత్త బట్టలను పంపిణీ చేశారు. పట్టణంలోని ఆమె నివాసం వద్ద ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ందరికీ పండుగ కానుకగా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత కోసం నిత్యం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వారి కుటుంబాలు పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దుస్తులు పంపిణీపై పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్ పాల్గొన్నారు.

దొంగల గెడ్డ కాలువ వద్ద కల్వర్టు నిర్మాణం చేపడుతున్న రైతులు

రైతుల సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం

పొందూరు: మండలం కింతలి గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే దొంగలగడ్డ కాలువ దాటాల్సిన పరిస్థితి. దీంతో కాలువగట్టును దాటే క్రమంలో పలువురు రైతులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళా రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ సమస్య నుంచి బయట పడేందుకు కల్వర్టు నిర్మాణం జరుపు కోవాలని భావించిన వారంతా సుమారు రూ.2 లక్షల నిధులను సమీకరించు కున్నారు. కాలువను దాటేందుకు వీలుగా సిమెంట్ కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ కల్వర్టు నిర్మాణం కోసం గ్రామానికి చెందిన రైతులు కంచరాన లక్ష్మణరావు, పైడిపెద్దిగారి పాపారావు కృషి చేశారు. తమ సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం చేపట్టిన రైతులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

శ్రీకాకుళం సిటీ : నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

కవిటి : ఎంపిపికి శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు

ఇచ్ఛాపురం : కేలండర్ ఆవిష్కరణ చేస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు గురువారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో క్యూ లైన్లలో జనాలు బారులు తీరారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీ, జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ప్రజలు భారీ స్థాయిలో తరలివచ్చారు. పట్టణంలో ట్రాఫిక్‌తో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడడంతో పోలీసులు అప్రమత్తమై బస్సులు, లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లు పట్టణంలోనికి రాకుండా వన్ వే మార్గంలో రాకపోకలు సాగించే విధంగా వాహనాలను దారి మళ్లించారు. ఎమ్మెల్యే రవికుమార్‌తో పాటు ఆయన సతీమణి ప్రమీల శుభాకాంక్షలు తెలిపి ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ ప్రత్యేకంగా రూపొందించిన క్యాలెండర్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు, మహిళలు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చారు.

పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌కు పుష్పగుచ్ఛాలు, మిఠాయిలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల శ్యామ్, పొడుగు శ్రీనివాసరావు, అత్తులూరి రవికాంత్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే బొడ్డేపల్లి పేటలో ఉన్న ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని పలువురు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి నివాసం వద్ద పలువురు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిపైనున్న కోట గోవిందరావు కార్యాలయం వద్ద తహశీల్దార్ కార్యాలయం వద్ద నున్న జనసేన కార్యాలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు పలువురు కలిసి మిఠాయిలు అందజేసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీకాకుళం సిటీ: నూతన సంవత్సరంలో నియోజక వర్గ ప్రగతి లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

రణస్థలం రూరల్ : నూతన సంవత్సర వేడుకల సందడి ప్రతి ముంగిట నుంచి రాజకీయ నాయకుల ఇళ్ల వరకు కనిపించింది. గ్రామాల్లో చిన్నారుల నుంచి మహిళలు వరకు నూతన సంవత్సర వేడుకలను సందడిగా నిర్వహించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు నడుకుదిటి పాలెం క్యాంపు కార్యాలయానికి నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండలంలోని కోష్ట గోశాల ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గంలోని పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు చేరుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణకుమార్ ఆయన స్వగ్రామంలోని పాతర్లపల్లిలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనను కలిసేందుకు వైసిపి నాయకులు అక్కడకు చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. రణస్థలంలో ఎంపిపి పిన్నింటి రజని సాయికుమార్ నివాసంలో కలిసేందుకు నియోజకవర్గంలోని అనేక గ్రామాల నుంచి అక్కడకు చేరుకున్నారు. కొండములగాంకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మేకా శ్రీనివాస్‌ను ఆయన అతిథి గృహంలో అభిమానులు, నాయకులు చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు.

పలాస : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, వజ్జ గంగా భవాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.విఠల్‌రావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ వసంతకుమార్, మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసు, కూటమి నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాశీబుగ్గ ప్రగతి భవన్ వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు వైసిపి నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ జి.వెంకటేష్‌కు డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ బాబా, లొడగల కామేశ్వరరావు వారి వారి నివాస గ హాలు వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

ఇచ్ఛాపురం: స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చైర్మన్ కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి స్కూల్ కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ ఇందిరారెడ్డి, మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శాంతి, రవి, శంకర్, శ్రీధర్, రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, యువశ్రీ ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్‌ప్రియా, సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, ఎంపిపి రాణా ఈశ్వరమ్మ, ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, ఎస్ఐ పి.రమేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కవిటి : సిలగాంలో ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్‌లకు అధికారులు, నాయకులు, స్థానికులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తూరు : మండలంలోని మాతలలో తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధువులు, స్నేహితులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆమదాలవలస : ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి నాయకులు

రణస్థలం రూరల్ : కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

పలాస : ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న బాబూరావు దంపతులు

అలాగే మండల కేంద్రంలోని వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు, కుంటిభద్రలో మాజీ వైస్ ఎంపిపి, గురండి ఎంపిటిసి ఆగతముడి భైరాగినాయుడులకు శుభాకాంక్షలు తెలిపారు.

టెక్కలి రూరల్: వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌కు నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కోటబొమ్మాళి : కళింగ కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్‌లకు కూటమి నాయకులు నూతన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ఫణీంద్రకుమార్‌కు మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తహశీల్దార్ అప్పలరాజుకు విఆర్‌ఒలు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ఆయా పంచాయతీ సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

వేడుకలు నిర్వహిస్తున్న దుర్యోధనరెడ్డి

వేర్వేరుగా న్యూఇయర్ వేడుకలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో జనసేనలో మరోసారి విబేధాలు బయట పడ్డాయి. నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, మత్స్యకారు విభాగ సంయుక్త కార్యదర్శి రవి బెహరా, మండలం అధ్యక్షులు, వీర మహిళ దుర్గాసి నీలవేణి వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. అలాగే యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు వ్యవహారశైలి నచ్చక వేరే కుంపటి పెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఇదే గ్రూప్ రాజకీయాలు చోటు చేసుకుంటే నియోజకవర్గంలో జనసేన ఉనికికి ప్రమాదం తప్పదని జన సైనికులు అంటున్నారు. పార్టీకి మొదటి నుంచి ఉండి కష్టపడిన కార్యకర్తలను పక్కన పెట్టి వ్యవహరిస్తున్న తీరుపై రాజుపై మండిపడుతున్నారు.

రోడ్డుపై పశువుల సంచారం

ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారుతుంది. ప్రధానంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి 8 గంటల వరకు స్కూల్ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల ఎక్కువగా తిరుగుతున్నాయి. పశువుల సంచారం సమస్యగా మారుతుంది. సింహద్వారం నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు, కుశాలపురం బైపాస్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ఎక్కువ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా కుశాలపురం బైపాస్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు పశుసంచారం ఉంటుంది. ఇది ప్రధాన సమస్యగా ఉంది. పశువుల యజమానులు విడిచి పెట్టటంతో పాటుగా, కొన్ని నిరుపయోగ పశువులు రోడ్డుపై విడిచి పెడుతున్నారు. జిల్లా కేంద్రం సమీపంలో గోశాలలు లేకపోవటం ఒక సమస్యగా ఉంది. విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాల్లో గోశాలలు నిర్వహిస్తున్నారు. అక్కడ గోశాలల్లో పశువులు ఎక్కువ కావటంతో ఇక్కడ నుంచి వెళ్తున్న వాహనాలను తిరస్కరిస్తున్నారు. దీంతో పశువుల తరలింపు సాధ్యం కావటం లేదు. శ్రీకాకుళం పట్టణంతో పాటు, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో సైతం ఈ సమస్య ఉంది. అధికారులు సైతం పశువులు తరలింపునకు జిల్లాలో గోశాల అవసరంగా భావిస్తున్నారు. కలెక్టర్ పశుసంవర్ధక శాఖకు గోశాల ప్రతిపాదనలు పంపాలని కోరారు. అయితే గోశాల స్థల సేకరణ, నిర్మాణం వంటివి బడ్జెట్‌తో కూడుకున్నవి కావటంతో ఈ ప్రతిపాదన ముందుకు సాగటం లేదు. రోడ్లు ఇరుగ్గా ఉన్న ప్రాంతాల్లో పశువుల సంచారం సమస్యగా ఉంది. కొన్ని సార్లు పశువులు అడ్డంగా రావటంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

గుజరాతీపేట సమీపంలో రోడ్డుపై ఉన్న పశువులు

ఏడి 'పింఛన్'

తలసేమియా బాధితుల ఆక్రందన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని వరకకు చెందిన ప్రవీణ్ పురియా(7) జన్మత తల సేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి 20 నుంచి 30 రోజులకొకసారి రక్తం ఎక్కించకపోతే అతని ప్రాణానికే ప్రమాదమని వైద్యులు చెప్పారు. రెక్కాడితే గాని డొక్కాడని ప్రవీణ్ తల్లి దండ్రులు శ్రీను పురియా, రాణి పురియా గతంలో హైదరాబాద్‌లో ఉంటూ బాబుకి దాతల సహాయంతో రక్తం ఎక్కించేవారు. రాను రానూ పరిస్థితులు అనుకూలించక పోవడంతో స్వగ్రామం చేరుకుని దాతల సాయంతో బాబుకి రక్త మార్పిడి చేస్తున్నారు. అయితే ఇటువంటి పిల్లలకు ప్రభుత్వం పింఛన్ అందిస్తుందని తెలిసి మూడేళ్ల క్రితం పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు చూపుతూ బాబుకి ఇప్పటివరకు పింఛను మంజూరు కాలేదు. ఓవైపు ప్రాణాలు తోడేస్తున్న అనారోగ్యం, మరోవైపు కుటుంబ ఆర్థిక సమస్యల మధ్య ప్రస్తుతం ప్రవీణ్ సతమతమవుతున్నాడు. ఇది కేవలం ప్రవీణ్ పురియా ఒక్కడి సమస్య మాత్రమే కాదు. జిల్లాలో ఇలాంటి బాధితులు పదుల సంఖ్యలో ఉన్నారు. వీరందరూ ఈరోజా, రేపా అంటూ పింఛను కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో మరోముఖ్య సమస్య బాధితులందరూ బడుగు బలహీన తరగతికి చెందిన వారే. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమను ఆదుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే పింఛను మా బాబుకి రక్తం అందేలా చేస్తుందని ప్రవీణ్ తల్లిదండ్రులు వాపోతున్నారు.

రక్తం ఇస్తున్న దాతలు

ప్రవీణ్